క్లుప్తంగా

ఎమ్మెల్యే పొన్నాడకు టీటీడీ పదవిపై హర్షం

తాళ్లరేవు: ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌కు తిరుమల తిరుపతి దేవస్థాన ట్రస్ట్ బోర్డు సభ్యునిగా పదవిని ఇవ్వడంపై మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పెయ్యల రమేష్, విశ్వజన కళామండలి జిల్లా అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెల్యే పొన్నాడ మరిన్ని పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు.

ఇంటింటికీ సంక్షేమ ఫలాలు చేరాలి



గృహ సారథులతో చర్చిస్తున్న వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బులినాని

అమలాపురం టౌన్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసున్న సంక్షేమ పథకాల ఫలాలు ఇంటింటికీ చేర్చడానికి గృహ సారథులు మరింత కీలకంగా పనిచేయాలని పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని బులినాని సూచించారు. బుధవారం స్థానిక వంటిద్దు వీధిలోని రెండో వార్డు సచివాలయంలో 2 ,3 ,4 వార్డుల గృహ సారథులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సదరు మూడు వార్డుల్లో ఇంటింటికీ సంక్షేమ పథకాలు ఎలా అందుతున్నాయో చర్చించారు. కార్యక్రమంలో వంటిద్దు వెంకన్నాయుడు, యల్లమిల్లి రాజు, గుండాబత్తుల నాగమణి, నల్లా ప్రసాద్, ఈతకోట శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేద వైద్య విద్యార్థినికి రూ.లక్ష సాయం

అమలాపురం టౌన్: ఆల్ ఇండియా నీట్ పరీక్షలో 721వ ర్యాంక్ సాధించి ప్రతిభ చాటిన అమలాపురం రూరల్ మండలం నడిపూడికి చెందిన పేద విద్యార్థిని మద్దాల దేవీశిరీషకు జేడీ ఫౌండేషన్ ఆర్థిక సాయం అందించింది. గుంటూరులో డాక్టర్ రమేష్ ఆస్పత్రిలో విద్యార్థినికి జేడీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మాజీ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ చేతుల మీదుగా రూ.లక్ష చెక్‌ను మంగళవారం అందజేశారని ఫౌండేషన్ ప్రతినిధి వీరంశెట్టి సతీష్ బుధవారం తెలిపారు. రానున్న నాలుగేళ్ల వైద్య విద్యకు అయ్యే ఖర్చును ఫౌండేషన్ భరిస్తుందని ఫౌండేషన్ ప్రతినిధులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు వీరంశెట్టి సతీష్, ఇక్కుర్తి లక్ష్మీనరసింహ, బందారు హుస్సేన్‌రావు, చారి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు సత్కారం



ఎంపికైన అభ్యర్థులను సత్కరించిన ఆర్‌పీఏ మునిస్వామి తదితరులు

యానాం: స్థానిక అంబేడ్కర్ విజ్ఞాన్ కేంద్రంలో కోచింగ్ తీసుకుని ఎల్‌డీసీ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను ఆర్‌పీఏ మునిస్వామి బుధవారం ఘనంగా సత్కరించారు. ఎల్‌డీసీ పరీక్షలో విజేతలుగా నిలిచిన అభ్యర్థులు కనకాల లక్ష్మీనారాయణ, కరెడ్ల అరుణాదేవి, కనకాల శివలను ఆర్‌పీఏ మునిస్వామి సత్కరించి మాట్లాడుతూ అంబేడ్కర్ విజ్ఞానకేంద్రం ద్వారా అందించిన కోచింగ్‌ను సద్వినియోగం చేసుకుని నిరుద్యోగ అభ్యర్థులు ఉద్యోగాలు సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంక్షేమాధికారి కొంకే రవికుమార్, కొల్లు నూకాంబరం, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ముమ్మిడివరం: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న మూడు అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ ఐ.విమల పేర్కొన్నారు. మండలంలోని చినకొత్తలంక, ముమ్మిడివరం గొల్లల వీధి, కాట్రేనికోన మండలం కందికుప్ప, అంగన్‌వాడీ కేంద్రాల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ పోస్టులకు ఈ నెల 16వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. స్థానికంగా నివాసముంటూ పదో తరగతి ఉత్తీర్ణులైన 35 ఏళ్ల లోపు వయసున్నవారు అర్హులన్నారు.

సిటీ గ్యాస్ పంపిణీ పాలసీపై అభిప్రాయ సేకరణ

యానాం: పుదుచ్చేరి సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ పాలసీ–2023పై ప్రజలు తమ అభిప్రాయాలను తెలపాలని పేర్కొంటూ డైరెక్టరేట్ ఆఫ్ ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ అధికారులు బుధవారం ఓ ప్రకటనలో కోరారు. ఇప్పటికే ముసాయిదా పాలసీని చూసేందుకు వీలుగా 'industry.py.gov.in' వెబ్‌సైట్‌లో పెట్టినట్లు తెలిపారు. తమ అభిప్రాయాలను, కామెంట్‌లను 'indpy.gov.in' మెయిల్‌కు పంపవచ్చన్నారు. పోస్టు ద్వారా డైరెక్టర్, డైరక్టరేట్ ఆఫ్ ఇండస్ట్రీస్ అండ్ కామర్స్, తట్టన్‌చావిడి, పుదుచ్చేరి–605009కు ఈనెల 20వ తేదీలోగా పంపాలని కోరారు.

గోకుల కృష్ణా.. గోపాల కృష్ణా

- ఘనంగా నల్లనయ్య పుట్టినరోజు వేడుకలు
- విష్ణాలయాల్లో ఆధ్యాత్మిక శోభ

అమలాపురం పట్టణం/ఉప్పలగుప్తం/అల్లవరం: మహాభారతంలోని ఒక చిన్న ఘట్టమే అయినా హిందువులు భగవద్గీతను తమ పవిత్రగ్రంథంగా భావిస్తారు. గీతాకారుడైన శ్రీకృష్ణుడిని దైవంగా పూజిస్తారు. భారత, భాగవతాలు రెండింటిలోనూ ప్రధాన భూమిక పోషించిన కృష్ణభగవానుడి పుట్టినరోజు వేడుకలు బుధవారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. నల్లనయ్య పుట్టిన రోజును భక్తులు శ్రీకృష్ణ జన్మాష్టమిగా జరుపుకున్నారు. ఆబాల గోపాలం కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొనగా, తల్లులు తమ చిన్నారులను చిన్ని కృష్ణులుగా అలంకరించుకుని మురిసిపోయారు. పలు గ్రామాల్లోని వైష్ణవాలయాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. బుధవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

- ఉప్పలగుప్తం, భీమనపల్లి, గొల్లవిల్లి, పెదగాడవిల్లి, ఎస్.కొత్తపల్లి తదితర గ్రామాల్లో శ్రీకృష్ణునికి భక్తులు ప్రత్యేక పూజలు చేసి, గ్రామోత్సవాలు నిర్వహించారు. శ్రీ కృష్ణ ఆలయాల సన్నిధిలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని అత్యంత వైభంగా జరిపారు. గొల్లవిల్లి గ్రామంలో చిన్నారులు శ్రీ కృష్ణ, గోపిక వేషధారణలో కోలాటాలు చేశారు.
- అమలాపురంలోని ఎర్ర వంతెన వద్ద గల గాయత్రి శ్రీసరస్వతి శిశు మందిరంలో సుమారు 50 మంది చిన్నారులు చిన్నికృష్ణుడు, సత్యభామ, గోపికల వేషధారణలో అలరించారు. శ్రీకృష్ణ గీతాలు, నృత్యాలతో రంజింపజేశారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని చిన్నారులచే నిర్వహించారు.



అమలాపురంలోని రావులచెరువులో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణల్లో చిన్నారులు

- అమలాపురం పట్టణంలోని రావులచెరువు ప్రాంతంలో శ్రీరామ సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. ఆ ప్రాంతానికి చెందిన చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణల్లో నృత్యాలు చేశారు. చిన్నారులు చేసిన మురళీ కోలాటం, వేణుగానం ఆకట్టుకున్నాయి.
- అల్లవరం మండలం దేవగుప్తంలో శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని ఆలయం వద్ద శ్రీకృష్ణుని వేషధారణలో చిన్నారులు ఉట్టి కొట్టేందుకు పోటీపడ్డారు. అల్లవరంలోని మొల్లేటిగరువులో రామాలయం వద్ద శ్రీలక్ష్మీ శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కృష్ణాష్టమి పురస్కరించుకుని పిల్లలు, పెద్దలు ఉట్టి కొట్టి సంబరాలు నిర్వహించారు.



ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లిలో కృష్ణ, గోపిక వేషధారణలో కోలాటం చేస్తున్న చిన్నారులు



అమలాపురం సరస్వతి శిశు మందిరంలో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణల్లో చిన్నారుల సందడి



అల్లవరంలో ఉట్టి కొడుతున్న చిన్నారులు

కవిత్వమే ఊపిరిగా అక్షర పోరాటం

అమలాపురం టౌన్: కవిత్వమే ఊపిరిగా కాలంతో అక్షర పోరాటం చేసిన కవి శిఖరం డాక్టర్ అద్దేపల్లి రామమోహనరావు అని శ్రీశ్రీ కళా వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు అన్నారు. స్థానిక కూచిమంచి అగ్రహారంలో బుధవారం జరిగిన సాహితీవేత్త డాక్టర్ అద్దేపల్లి రామ్మోహనరావు జయంతి సభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సభలో డాక్టర్ అద్దేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కవి నల్లా నరసింహమూర్తి, కవి మాకే బాలార్జున సత్యనారాయణ, గుర్రం రామకృష్ణారావు, విశ్రాంత పీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ అద్దంకి అమరేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ అద్దేపల్లి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా శ్రీశ్రీ కళా వేదిక గౌరవాధ్యక్షుడు నానిరాజు తదితరులు

విద్యార్థులు సామరస్యపూర్వక జీవితాన్ని గడపాలి

న్యాయ అవగాహన సదస్సులో అడిషనల్ జిల్లా జడ్జి నరేష్

అమలాపురం రూరల్: విద్యార్థులు ఎటువంటి చెడు అలవాట్లకు లోనవకుండా సామరస్యపూర్వక జీవితాన్ని గడపాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ అధ్యక్షుడు, అడిషనల్ జిల్లా జడ్జి వి.నరేష్ అన్నారు. అమలాపురంలో కిమ్స్ డెంటల్ కాలేజీలో బుధవారం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో దంత వైద్య కళాశాల విద్యార్థులు, అధ్యాపకులకు న్యాయ అవగాహన వర్క్ షాప్ నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన అడిషనల్ జిల్లా జడ్జి వి.నరేష్ మాట్లాడుతూ ర్యాగింగ్, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలు, ప్రభుత్వ చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వి.శివకుమార్, రూరల్ సీఐ వీరబాబు, తాలూకా ఎస్‌ఐ అందే పరదేశి, డాక్టర్ సుమీత్ శర్మ జి.కార్తీక్, సుబ్రహ్మణ్యం, మేనేజర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



న్యాయ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అడిషనల్ జిల్లా జడ్జి నరేష్

నవోదయలో పరిసరాల పచ్చదనం

యానాం: స్వచ్ఛత పక్వాడా కార్యక్రమంలో భాగంగా స్థానిక మెట్టకూరులోని నవోదయ విద్యాలయలో బుధవారం విద్యాలయ పరిసరాలు–పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు మాట్లాడుతూ విద్యాలయ పరిసరాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సింగిల్ యూసేజ్ ప్లాస్టిక్‌ను నిర్మూలించే విధంగా కృషి చేయాలని కోరారు. రోజూ కనీసం ఒక లీటరు నీటిని పొదుపుచేయాలని సూచించారు. పౌష్టికాహారం ఆవశ్యకతను ఆయుష్ వెల్‌నెస్ ఆసుపత్రి న్యూట్రిషియన్ డాక్టర్ గ్లోరి కుమారి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కెప్టెన్ పాపారావు, వైస్ ప్రిన్సిపాల్ బేగం, అధ్యాపకులు సాంబశివరావు, సిబ్బంది పాల్గొన్నారు.



స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమంలో విద్యార్థులు

రాధాకృష్ణకు పౌర సన్మానం



రాధాకృష్ణ దంపతులను సత్కరిస్తున్న జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్ తదితరులు

అమలాపురం రూరల్: బెంగళూరు ఎల్ఆర్‌డీఈ డైరెక్టర్‌గా పదవీ విరమణ చేసిన వన్నె చింతలపూడి గ్రామానికి చెందిన పరమట రాధాకృష్ణకు గ్రామస్తులు పౌర సన్మానం చేశారు. వన్నె చింతలపూడి హైస్కూల్‌లో బుధవారం జరిగిన ఈ సత్కార సభకు జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్ పాల్గొని రాధాకృష్ణ దంపతులను సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు రాధాకృష్ణ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సామాజికవేత్త పచ్చిమాల బాబ్జి, శాస్త్రవేత్త సీహెచ్ శ్రీనివాసరావు, సర్పంచులు నక్కా రాజారత్న నాగవాణి, పరమట శ్యామ్ కుమార్, తహసీల్దార్ పరమట పల్లవి, పరమట నాగమణి తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగికి అభినందనలు

ఉప్పలగుప్తం: భారత్ సంచార నిగమ్ లిమిటెడ్‌లో 32 ఏళ్ల పాటు టెక్నీషియన్‌గా పనిచేసి ఇటీవల పదవీ విరమణ పొందిన సాయిబాబును బుధవారం ఘనంగా సత్కరించారు. మండలంలోని గొల్లవిల్లి పంచాయతీ పరిధి వాడపర్రుకు చెందిన కడలి సాయిబాబు, గజలక్ష్మి దంపతులను దుశ్శాలువాతో అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ, ఏఎంసీ డైరెక్టర్ చప్పిడి దుర్గారావు, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ఉప్పలగుప్తం: మండలంలోని భీమనపల్లి పంచాయతీ పరిధి వీర్రాజు కాలువ గట్టు వద్ద రూ.10 లక్షల జెడ్పీ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు బుధవారం శంకుస్థాపన చేశారు. గ్రామానికి నిధులు సమకూర్చి అభివృద్ధికి సహకరించిన సంపదరావును సర్పంచ్ పెయ్యల రాజ్‌కుమార్, మాజీ ఎంపీపీ శిరంగు సత్తిరాజు, సొసైటీ అధ్యక్షుడు శిరంగు సత్తిరాజు, మండల వ్యవసాయ సలహా మండలి సభ్యుడు రాయపురెడ్డి నాగు, మేడిశెట్టి సూరిబాబు తదితరులు దుశ్శాలువాతో సత్కరించారు.

ప్రకృతి వ్యవసాయ సాగు పరిశీలన

అమలాపురం రూరల్: మండలంలోని నల్లమిల్లి గ్రామంలో ఆదర్శ రైతు అప్పారి చిన వెంకటరమణ పొలంలో సాగుతున్న ప్రకృతి వ్యవసాయాన్ని జిల్లా వ్యవసాయ అధికారి బోసుబాబు పరిశీలించారు. రైతు వెంకటరమణ ఆచరిస్తున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. 365 రోజుల కిచెన్ గార్డెన్‌తో పాటు సూర్య మండలం మోడల్ పొలంలో ఉన్న అజోల్లా–అజోల్లా పిట్‌ను సందర్శించారు. ఆయన వెంట సహాయ సంచాలకుడు ఎంఏ షంషి, ఏవో కడలి ధర్మప్రసాద్, వీఈవో సందీప్, రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం

ఉప్పలగుప్తం: మండలంలోని ఎస్.యానం జెడ్పీ ఉన్నత పాఠశాలలో కాంట్రాక్టు ఉపాధ్యాయులకు హెచ్ఎం బి.అప్పారావు ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం ఘనంగా సత్కరించారు. గత 25 ఏళ్లుగా పాఠశాలలో ఉపాధ్యాయులుగా సేవలందించి ఇటీవల ప్రభుత్వ ఉద్యోగులుగా నియమితులైన 1998 డీఎస్సీకు చెందిన ఆకుల పద్దయ్యనాయుడు, అక్కిరాజు ఫణిబాబులను దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కె.సత్యరాజు, టి.హరికృష్ణ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వీటు సారెలో ఒదిగిన ఆకృతులు



పలు రకాల పండ్ల ఆకృతుల్లో స్వీట్లు



పెళ్లి పట్టు చీర, గాజులు, కుంకుమ భరిణెను తలపిస్తున్న స్వీటు

అమలాపురం టౌన్: స్వీటు సారెలో పలు రకాల ఆకృతులు ఒదిగాయి. అచ్చం మడతతో ఉన్న కొత్త చీర, అరటి పళ్లు, కూరగాయలు, కొబ్బరి కాయ ఇలా ఎన్నో ఆకృతులు ఈ స్వీటు దుకాణంలో ఆవిష్కృతమయ్యాయి. అమలాపురం కాలేజీ రోడ్డులోని వైష్ణవీ ఫుడ్స్(స్వీట్ అండ్ బేకరీ) దుకాణ యాజమాని కాసర సురేష్ ఈ అందమైన ఆకృతులను రూపొందిస్తున్నారు. సహజత్వం ఉట్టి పడేలా ఆ ఆకృతులు ఉండడంతో చూపరును ఇట్టే ఆకట్టుకుంటున్నాయి. అమలాపురానికి చెందిన ఓ ఇంట జరుగుతున్న వివాహానికి సంబంధించి రాజమహేంద్రవరంలోని వరుడు ఇంటికి తీసుకెళ్లేందుకు వివిధ ఆకృతులతో కూడిన స్వీట్లు తయారు చేసి పంపిస్తున్నారు.

పెళ్లి వేడుకలు.. ఆధునిక హంగులు

అమలాపురం టౌన్: మూడు ముళ్లు.. ఏడు అడుగులతో ముడిపడే పెళ్లి తంతును కుటుంబీకులు, బంధువులు, స్నేహితుల సమక్షంలో తాహతుకు తగ్గట్లుగా వేడుకగా జరుపుకోవడం పరిపాటి. అయితే ప్రస్తుతం పెళ్లి వేడుకలు ఆధునిక హంగుల్ని అద్దుకుంటూ కొత్త పుంతలు తొక్కుతున్నాయి. అమలాపురం మండలం ఇందుపల్లిలోని ఫంక్షన్ హాలులో మంగళవారం రాత్రి జరిగిన ఓ వివాహ వేడుకలో వధూవరులు గాల్లో తేలినట్లుండే అన్నట్లుగా భారీ క్రేన్ సాయంతో గాలిలో నిలబెట్టిన ఓ భారీ పక్షి ఆకాశంలో విహరిస్తున్నట్లుగా ఉన్న సెట్టింగ్‌లో నిలబడి కనువిందు చేశారు. మూడు రోజుల క్రితం రాజోలులో జరిగిన ఓ వివాహ వేడుకలోనైతే కొత్త జంట ఓ పాత టాప్‌లెస్ కారులో ఊరేగింపుగా వస్తుంటే ఆ వాహనం చుట్టూ నల్లటి దుస్తుల్లో బౌన్సర్లు కాపలాగా నిలిచారు. వాహనానికి ముందు పలువురు మహిళలు చీర కట్టుకుని, తలకు పాగాలు చుట్టుకుని, కళ్లకు నల్ల అద్దాలు పెట్టుకుని బుల్లెట్ మోటారు సైకిళ్లు తొక్కుతూ వెళ్లడం వీఐపీలకు భారీ సెక్యూరిటీతో సాగుతున్న దృశ్యాన్ని తలపించింది. రాజోలు రోడ్లపై ఈ పెళ్లి జంట ఊరేగింపు అందరి చేతా ఔరా అనిపించింది. ఈ వినూత్న ప్రదర్శనలు చూసినవారంతా గోదారోళ్లా మజాకా అంటూ వ్యాఖ్యానిస్తున్నారు.



అమలాపురంలో పక్షి ఆకాశంలో విహరిస్తున్నట్లుగా ఉన్న సెట్టింగ్‌పై వధూవరులు



రాజోలులో సెక్యూరిటీ గార్డుల్లా పెళ్లి జంటను ఊరేగిస్తున్న బౌన్సర్లు, బుల్లెట్‌లపై మహిళలు

పలువురికి ఎమ్మెల్యే అశోక్ పరామర్శ

యానాం: నియోజకవర్గ పరిధిలో పలువురిని బుధవారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పరామర్శించారు. పుదుచ్చేరిలోని తవలకుప్పంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న అంబేడ్కర్‌నగర్‌కు చెందిన బోడపాటి సురేష్‌బాబు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయనను ఎమ్మెల్యే అశోక్ పరామర్శించారు. జిప్‌మెర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అంబేడ్కర్‌నగర్‌కు చెందిన వరసాల సంధ్య, కోరుకొండ మహాలక్ష్మిలను ఆయన పరామర్శించారు.

వీరప్రకాశరావు సేవలు చిరస్మరణీయం

యానాం: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంతో పాటు దళితులకు తన వంతు సాయం చేసిన ఉపాధ్యాయ నేత గుడాల వీరప్రకాశరావు సేవలు చిరస్మరణీయమైనవని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక కామిశెట్టివారివీధిలో కోకోనట్ మర్చంట్స్ భవనంలో జరిగిన సంస్మరణ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. వీరప్రకాశరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్‌పీఏ నామాడి అప్పారావు, పొనుగుమట్ల విష్ణుమూర్తి, కె జానకిరాముడు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలు

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లోని తాళ్లరేవు బైపాస్‌లో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, కోరంగి పోలీసులు తెలిపిన వివరాల మేరకు బుధవారం కాకినాడ వెంకట కృష్ణాపురానికి చెందిన ఇద్దరు మహిళలు యానాంలోని ఒక ఫంక్షన్‌కు హాజరై తిరిగి వస్తుండగా ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో వారిద్దరికీ తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు హుటాహుటీన 108 వాహనంలో కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. డ్రైవర్ మద్యం మత్తులో ఉండడం వల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. గాయపడిన వారి వివరాలు తెలియాల్సి ఉంది.

పలువురు పోలీసులకు బదిలీలు

యానాం: పుదుచ్చేరిలో విధులు నిర్వహిస్తున్న యానాం ప్రాంతానికి చెందిన పలువురు పోలీసులను బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఎన్ శ్రీనివాసరావును ట్రాఫిక్‌కు, పెమ్మాడి వెంకన్నబాబు, పంపన మూర్తి, వీరబాబు, జేబీవీ సుబ్బారావులను కోస్టల్‌కు, పి.ఏసుబాబు, మహాలక్ష్మీరావును పీఏపీ యానాంకు, పెంకే గణేష్, బడుగు దుర్గారావు, తమిళవేలన్‌లను యానాం పీఎస్‌కు బదిలీ చేస్తూ ఎస్పీ సుభాష్‌గోష్ ఆదేశాలిచ్చారు.

9 మంది జూదరుల అరెస్ట్

అమలాపురం రూరల్: మండలంలోని బండారులంకలో బుధవారం కోడిపందేల శిబిరంపై అమలాపురం తాలూకా పోలీసులు దాడిచేసి 9 మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.10,100 నగదు, రెండు కోడిపుంజులు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ అందే పరదేశి తెలిపారు.

పల్లంకుర్రులో..

కాట్రేనికోన: మండలంలోని పల్లంకుర్రులో కోడి పందేల శిబిరంపై దాడి చేయగా జూదరులు పారిపోయారని, అక్కడ 10 పందెం కోళ్లను, కత్తులను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ టి.శ్రీనివాస్ బుధవారం తెలిపారు. పందేలు నిర్వహిస్తున్న భూపతిరాజు శివకుమార్‌వర్మ, మరికొందరిపై కేసు నమోదుచేశామన్నారు.

రాజ్యసభ సభ్యుడు మోపిదేవిని కలిసిన ఎమ్మెల్యే అశోక్



రాజ్యసభ సభ్యుడు మోపిదేవిని సత్కరించిన ఎమ్మెల్యే అశోక్

యానాం: రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ ఒక వివాహ వేడుకలో హాజరయ్యేందుకు బుధవారం యానాం వచ్చారు. స్థానికంగా ఓ అతిథి గృహంలో ఉన్న మోపిదేవి వెంకటరమణను ఎమ్మెల్యే అశోక్ మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ స్థానిక పరిస్థితులను ఆయనకు తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్మశానం ఆక్రమణపై ఫిర్యాదు

ముమ్మిడివరం: మండలంలోని సీహెచ్ గున్నేపల్లిలో నల్లావారిపేటలో ఎన్నో ఏళ్లుగా అంత్యక్రియలకు వాడుకుంటున్న శ్మశాన స్థలాన్ని కొందరు వ్యక్తులు ఆక్రమించుకున్నారని గ్రామస్తులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని స్థానిక రెవెన్యూ అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదని, ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణకు గురైన శ్మశానాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవాలని కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయినికి సత్కారం

ముమ్మిడివరం: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు అందుకున్న స్థానిక సోమిదేవరపాలెం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని పి.హిమబిందును ఎస్టీయూ శాఖ బుధవారం ఘనంగా సత్కరించింది. ఎస్టీయూ సంఘ నాయకులు సఖిలే తిరుపతిరావు, బి.విజయలక్ష్మి, పీవీవీ సత్యనారాయణ రాజు, ఎం.లక్ష్మణరావు తదితరులు ఆమెను దుశ్శాలువాతో అభినందించారు.

వెంకన్న ఆలయంలో విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

యానాం: కృష్ణాష్టమిని పురస్కరించుకుని బుధవారం శ్రీభూసమేత శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం 7 గంటల నుంచి స్వామివారికి పల్లకీ సేవ, సంబరం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు పెద్దింటి లక్ష్మణాచార్యులు, పెద్దింటి రఘురామ్‌వినోద్, అనంతాచార్యులు పాల్గొన్నారు.

వరద రక్షణ గేటు ఏర్పాటు చేయాలి

యానాం: వరద నీరు యానాం పట్టణంలోకి ప్రవేశించకుండా భీమ్‌నగర్ శ్మశానవాటిక ప్రాంతంలో ఉన్న వంతెనకు వరద రక్షణ గేటును ఏర్పాటు చేయాలని బుధవారం బ్లాక్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి మల్లాడి సత్తిబాబు కోరారు. ఆయన ఆ ప్రాంతాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించి మాట్లాడారు. ఓల్డ్‌రాజీవ్‌నగర్ టైడల్ లాకు వద్ద ప్రజాపనుల శాఖ ఏర్పాటుచేసినట్లుగా భీమ్‌నగర్ వద్ద లాకుగేట్లు ఏర్పాటుచేస్తే వరద నీరు యానాంలోకి ప్రవేశించదన్నారు.

జోడో యాత్రకు తరలిరావాలి

ముమ్మిడివరం: రాహుల్ గాంధీ జోడో యాత్ర నిర్వహించి ఏడాది పూర్తయిన సందర్భంగా గురువారం అమలాపురంలో నిర్వహించనున్న జోడో యాత్రకు పార్టీ నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా డిపార్ట్‌మెంట్ చైర్మన్ వడ్డి నాగేశ్వరరావు తెలిపారు. సాయంత్రం 5 గంటలకు అమలాపురం గడియార స్తంభం సెంటర్ నుంచి ఈదరపల్లి వంతెన వరకూ జరుగుతుందన్నారు.

సర్పంచ్‌కు ఎమ్మెల్యే పరామర్శ

ఉప్పలగుప్తం: పితృవియోగంతో బాధపడుతున్న సర్పంచ్ కరాటం లక్ష్మీప్రసన్న కుటుంబీకులను పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఉప్పలగుప్తం మండలం పెదగాడవిల్లిలో బుధవారం పరామర్శించారు.